మున్సిపల్ కమిషనర్‌గా రత్నకుమార్

రత్నకుమార్

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా టిటి రత్నకుమార్‌ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇన్‌ఛార్జి కమిషనర్‌గా మున్సిపల్ డిఇ ప్రసాద్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం జివిఎంసి నుంచి రత్నకుమార్ ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. గడచిన ఆరు నెలల్లో మున్సిపల్ కమిషనర్‌గా ఆరుగురు అధికారులు బాధ్యతలు స్వీకరించారు.

అస్తవ్యస్తంగా పురపాలన

- కమిషనర్, ఉద్యోగుల మధ్య యుద్ధం
- చైర్‌పర్సన్, ఎమ్మెల్యే నడుమ రాజకీయ దుమారం
- స్తంభించిన అభివృద్ధి పనులు
- పంతానికి పోయి ప్రజాసమస్యలు గాలికి...

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం పురపాలన అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణంలో అభివృద్ధి పనులు స్తంభించిపోయాయి. ప్రజాసమస్యలు పక్కదారి పడుతున్నాయి. పట్టణ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వరుసగా మూడు మున్సిపల్ సమావేశాలు వాయిదా పడడంతో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. వైసిపికి చెందిన పాలకవర్గం ఉన్నప్పటికీ డమ్మీగా చేసే ప్రయత్నంలో అధికారపార్టీ నాయకులు ఉన్నారు.

కొద్ది నెలల క్రితం పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించిన టిడిపి నాయకులు చేతులు కాల్చుకున్నారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కమిషనర్ వెంకటేశ్వర్లును చెప్పుచేతల్లో పెట్టుకుని చైర్ పర్సన్ బోను గౌరీశ్వరిని నిలువరించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. కౌన్సిల్‌లో టిడిపికి ఆధిక్యత ఉన్నా మాట నెగ్గించుకోలేని పరిస్థితి నెలకొంది. వరుసగా మూడు మున్సిపల్ సమావేశాల్లోనూ గందరగోళం ఏర్పడింది. అజెండాలో ఉన్న అంశాల్లో ఎవరికి నచ్చిన వాటిని వారు ఆమోదించుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. కానీ ఏకాభిప్రాయం కుదరకపోవడంతో కౌన్సిల్ సమావేశాలు వాయిదా పడుతున్నాయి. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలనే చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.. చైర్ పర్సన్ బోను గౌరీశ్వరితో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చూడాల్సి ఉంది. కానీ ఆయన పంతానికి పోయి ప్రజా సమస్యలు గాలికి వదిలేస్తున్నారు. చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలు చేసుకోవడానికి మున్సిపల్ సమావేశాలను వేదికలుగా వాడుకుంటున్నారు.

కమిషనర్ వర్సెస్ ఉద్యోగులు

ఒకవైపు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మధ్య మాటల యుద్ధం నడుస్తుంటే మరోవైపు కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఉద్యోగుల మధ్య రగడ రాజుకుంది. మున్సిపల్ ఉద్యోగులు కమిషనర్ వెంకటేశ్వర్లుపై ఎమ్మెల్యేకి, జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. కమిషనర్ వెంకటేశ్వర్లు తమను వేధిస్తున్నారని, దుర్భాషలాడుతున్నారని ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా కమిషనర్ బాహాటంగా ముడుపులు డిమాండ్ చేస్తున్నారని, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఉన్నతాధికారులకు లంచాలిచ్చి పోస్ట్‌లోకి వచ్చానని చెప్పి నేరుగా వసూళ్లు చేపడుతున్నారని ఉద్యోగులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ధీమాతోనే కమిషనర్ వెంకటేశ్వర్లు ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారనేది తేటతెల్లమైంది. తాజా పరిణామాల నేపథ్యంలో పురపాలన అస్తవ్యస్తంగా తయారైంది. దీనిని గాడిలో పెట్టే నాథుడు కనిపించడం లేదు. మరో ఆరు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు రానున్నాయి. పాలకవర్గంతో సమన్వయం చేసుకుంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సిన అధికారపార్టీ నాయకులు మరింత చులకనయ్యే పరిస్థితిని తెచ్చుకుంటున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడానికే ప్రాధాన్యతనిస్తూ పట్టణాభివృద్ధిని తిరోగమనంలోకి పెడుతున్నారని ప్రజలు భావిస్తున్నారు.

మున్సిపల్ కమిషనర్ సరెండర్

ప్రజాశక్తి కథనాలకు స్పందన

మున్సిపల్ కమిషనర్ వి.హెచ్.వెంకటేశ్వర్లును సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుధవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయానికి మెయిల్ ద్వారా ఉత్తర్వులు చేరాయి. గత కొద్ది రోజులుగా మున్సిపల్ ఉద్యోగులు కమిషనర్ వెంకటేశ్వర్లు వ్యవహారశైలిపై తిరుగుబాటు చేశారు. దీనిపై ప్రజాశక్తిలో వరుస కథనాలు ప్రచురించడంతో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. తమను వేధిస్తున్నారని, దుర్భాషలాడుతున్నారని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఉద్యోగులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాక, చర్యలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కమిషనర్ పనితీరుపై గుర్రుగా ఉన్న జిల్లా కలెక్టర్.. మున్సిపల్ ఉన్నతాధికారులకు నివేదిక పంపించడంతో మున్సిపల్ డైరెక్టర్ సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. తనపై చర్యలు ఉంటాయని ముందుగా గ్రహించిన కమిషనర్ వెంకటేశ్వర్లు సెలవు పెట్టి ఇన్‌ఛార్జి కమిషనర్‌గా మున్సిపల్ ఎఇ సన్యాసిరావుకు బాధ్యతలు అప్పగించారు.

ఈ నెల 15 నుంచి

మహిళలకు ఉచిత బస్సు

- కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- జిల్లాలో రోజుకు 30 వేల మంది మహిళలు ప్రయాణించే అవకాశం
- 180 బస్సులు కేటాయింపు
- ఐదు రకాల బస్సుల్లోనే అనుమతి
- ఆధార్, ఓటరుకార్డు, రేషన్‌కార్డు చూపించి రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణం

ప్రజాశక్తి-విజయనగరంకోట, పార్వతీపురం

టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఈనెల 15 నుంచి అమలు కానుంది. ఆగస్టు 15 సందర్భంగా స్త్రీశక్తి పథకం పేరుతో ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనుంది. ఈమేరకు బుధవారం జరిగిన రాష్ట్రకేబినెట్ సమావేశంలో ఈ పథకం అమలుకు ఆమోదం తెలిపింది. దీంతో జిల్లాలోని మహిళలందరికీ ఆర్‌టిసిలో ఉచితంగా ప్రయాణించే అవకాశం కలగనుంది. ప్రస్తుతం జిల్లాలో మహిళా ప్రయాణికుల సంఖ్య 25 వేల వరకు ఉంది. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లోకి వస్తే రోజూ 30 వేల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పథకం కింద మహిళలు, బాలికలు ట్రాన్స్‌జెండర్లు ఎక్కడి నుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడినుంచి ఎక్కఃడికైనా ప్రయాణించేందుకుఅవకాశం కల్పించింది.

రోజుకు 30 వేల మంది ప్రయాణించే అవకాశం

జిల్లాలో ప్రధానంగా పార్వతీపురం, సాలూరు, పాలకొండ ఆర్‌టిసి డిపోల ద్వారా ప్రజలకు ప్రజా రవాణా అందిస్తోంది. ఈ మూడు డిపోల్లో రోజుకు ప్రస్తుతం సుమారు 60 వేల మంది వరకు ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వస్తే 30 వేల మంది మహిళలు ప్రయాణించే అవకాశం ఉందని ఆర్‌టిసి అధికారులు అంచనా వేశారు. మహిళా ప్రయాణికులకు తగ్గట్టుగా 180 బస్సులను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. అందులో పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, మెట్రో, ఎక్స్‌ప్రెస్ బస్సులను ఉచిత ప్రయాణానికి కేటాయించారు. బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించు కునేందుకు మహిళలు ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఐడి ప్రూఫ్‌లుగా చూపించాల్సి ఉంటుంది. ఈ పథకం అమలులో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు ప్రభుత్వం మహిళా కండక్టర్లకు బాడీ కెమేరాలు, బస్సులలో సీసీ కెమెరాలు అమర్చనుంది. తద్వారా మహిళల, బాలికల భద్రతకు పెద్ద పీట వేయనున్నట్లు రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖా మంత్రి కె.పార్థసారధి వెల్లడించారు. అలాగే బస్ స్టేషన్లలో మౌలిక వసతులైన ఫ్యాన్లు, మంచి నీటి సౌకర్యం కూడా కల్పించనున్నారు.

అగ్రిగోల్డ్ భూముల సర్వే వేగవంతం

సబ్ కలెక్టర్ అశుతోష్

రికార్డులను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్

ప్రజాశక్తి-కొమరాడ

అగ్రిగోల్డ్ భూములు, టేకు చెట్ల విలువ సర్వేను వేగవంతం చేసి, నివేదికలు సిద్ధం చేయాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ... అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని చోళ్లపదం, ఉలిపిరి పంచాయతీల పరిధిలో ఉన్న 75 ఎకరాల అగ్రిగోల్డ్ భూములను, టేకు తోటలను స్థానిక రెవెన్యూ, సిఐడి, అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అగ్రిగోల్డ్ భూములు ఉన్న 75 ఎకరాల్లో రికార్డుల్లో తప్పిదాలు ఉన్నాయా? సక్రమంగా ఉన్నాయా? అని స్థానిక రెవెన్యూ అధికారులను ఆరాతీశారు. స్థానిక రైతుల జిరాయితే అగ్రిగోల్డ్ భూములుగా ఆన్‌లైన్‌లో నమోదైనట్లు తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ తెలిపారు. ఆ రైతులు తమ పేరిట భూములను మార్చాలని అనేకసార్లు సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టిలో పెట్టినట్లు వివరించారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న టేకు చెట్ల సర్వే ఖర్చుతో కూడుకున్న విషయమని తెలిపారు. మొక్కలు సర్వే చేసి నెంబర్లు వేయడానికి కూలీల ఖర్చు సుమారు రోజుకు రూ.3 వేలు నుంచి రూ.5 వేల వరకు అవుతుందని తెలిపారు. ఈ సర్వే మొత్తం పూర్తి చేయాలంటే దాదాపు రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ ఖర్చు ప్రభుత్వం లేదా అగ్రిగోల్డ్ సంస్థ భరించాలని వారు చెప్పడంతో సబ్ కలెక్టర్... సిఐడి ప్రతినిధులతో మాట్లాడి, నిధులు సమకూర్చే విధంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వంశీకృష్ణ, ఫారెస్ట్ సెక్షన్ అధికారి మహేంద్ర, బీట్ అధికారి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రహదారి సదుపాయం కల్పించాలి

చోళ్లపదం ఆర్ అండ్ బి రహదారి నుండి సరుడుగూడ గ్రామానికి ఉన్న గోర్జికి రహదారి సదుపాయం కల్పించాలని స్థానిక రైతులు సబ్‌కలెక్టర్‌కు వినతి అందించారు. పూర్వకాలం నుంచి ఉన్న గోర్జికి రెండు వైపులా కబ్జాతో రహదారి ఇరుకు కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ట్రాక్టర్లు వ్యవసాయ పనుల కోసం వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు.

ద్విచక్ర వాహనంపై బురదదారిలో..

అగ్రిగోల్డ్ భూములను పరిశీలించేందుకు వచ్చిన సబ్ కలెక్టర్ అశుతోష్.. చోళ్లపదం నుంచి అక్కడికి ద్విచక్రవాహనంపై బురద మార్గంలో ప్రయాణించాల్సి వచ్చింది. గోర్జిలో కారు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో బురదమయమైన రోడ్డుపై బైక్ వెళ్లారు. అనంతరం గమ్య స్థలానికి వెళ్లి ఆ భూములను పరిశీలించి, తిరిగి అదే ద్విచక్ర వాహనంపై తన కారు వద్దకు వచ్చారు.

బైక్‌పై వెళ్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్

ఆ కలప ఎవరిది? : సిపిఎం

ప్రజాశక్తి-కొమరాడ

తహశీల్దార్ పట్టుకున్న టేకు కలప అగ్రిగోల్డ్ భూముల్లోదా? లేక రైతులదా? అని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న రెండు నాటుబళ్ల కలపను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సుమారు 75 ఎకరాల అగ్రిగోల్డ్ భూముల్లోని టేకు చెట్లు రాత్రివేళ మాయమైనట్లు తెలిసిందని ఆయన అన్నారు. కలప పట్టుబడిన 8 రోజులైనా ఎవరిదో తేల్చడంలో జాప్యమెందుకని ప్రశ్నించారు. దీని వెనుక ఎవరున్నా నిజానిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు హెచ్ రామారావు ఉన్నారు.

133 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-పాచిపెంట

గంజాయితో పట్టుబడిన ఆటో వద్ద పోలీసులు

133 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు. అరకు సమీపంలోని హుకుంపేట నుండి పాచిపెంట మండలం మోదుగ, మాతుమూరు జంక్షన్ మీదుగా సాలూరు వైపు ఆటోలో గంజాయి తరలిస్తున్నారు. మాతుమూరు కూడలిలో ఆటోను పోలీసులు తనిఖీ చేయగా 133 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయిని సీజ్ చేశారు. అరకులోని డుంబిరిగూడ మండలానికి చెందిన కొర్ర డానియల్ జన్ని దివాకర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గోకులాలతో పాడి రైతులకు మేలు

ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి



గోకులాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ యశ్వంత్

ప్రజాశక్తి-సీతంపేట

గోకులం పథకం ద్వారా నిర్మించిన షెడ్లతో పాడి రైతులకు అధిక లాభదాయకమని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పిపి ఈతమానుగూడ, ఆనపకాయలగూడ గ్రామాల్లో నిర్మించిన గోకులం షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా షెడ్డు నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. ఒక్కో గోకులం షెడ్డును రూ.22 లక్షలతో నిర్మించినట్లు పిఒ తెలిపారు. ఈ గోకులం షెడ్లను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ కుమార్, డిఇ నాగభూషణరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో కార్యవర్గం పనిచేయాలి

కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ • రెడ్‌క్రాస్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

జిల్లాలో నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు చిత్తశుద్ధితో పూర్తి స్థాయిలో ప్రజలకు సేవలు అందించాలని రెడ్‌క్రాస్ అధ్యక్షులు, కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా రెడ్ క్రాస్ నూతన అధ్యక్ష, కార్యదర్శి ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు గిరిజన ప్రాంతాల్లో ఇంకా విస్తరించాలని సూచించారు. ప్రతి మండలంలోనూ సభ్యత్వ నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నెల నెలా సంస్థ ద్వారా చేసే సేవలకు ప్రగతి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో మలేరియా, అనిమియా, సికిల్ సెల్ బాధితుల వివరాలు నమోదు చేయాలని, వారికి అవసరమైన మందులు బలవర్ధకమైన ఆహారం రెడ్‌క్రాస్ నుంచి అందేలా చూడాలన్నారు. గర్భిణులకు ఆహారం అందించాలని, చదువుకునే పిల్లలకు రెడ్‌క్రాస్ సంస్థ తరపున సాయం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజూ రెడ్ క్రాస్ ద్వారా జరిగే అన్నదానం కార్యక్రమ వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ సభ్యులకు సూచించారు. రక్త హీనత నివారణ కోసం రెడ్ క్రాస్ ప్రత్యేక రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని, రక్త సేకరణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. వృద్ధులకు వయోజన విద్య ద్వారా రాత్రి బడులు నిర్వహించాలని తెలిపారు.

రెడ్ క్రాస్ సంస్థకు నగరంలో ప్రభుత్వ భవనం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. రక్తం కోసం ఎవరూ వేరే జిల్లాలకు వెళ్ళకూడదన్నారు. జిల్లాలో ఇప్పటికి వరకూ ఒక్క ప్రసూతి మరణం జరగకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు వైద్యం అందించారని కలెక్టర్ ప్రశంసించారు. ప్రతి మండలంలో రెడ్ క్రాస్ కమిటీ ఉండాలని, నెల లేదా మూడు నెలలకొకసారి సమావేశాలు నిర్వహించాలని అన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్‌గా మంచిపల్లి శ్రీరాములు, కార్యదర్శిగా బి.నాగభూషణరావు, కోశాధికారిగా పెంటపాటి సూర్యారావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ సేవకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, కార్యదర్శి బి. నాగభూషణరావు, కోశాధికారి పెంటపాటి సూర్యారావు, కోఆర్డినేటర్ జనార్దనరావు, మేనేజ్మెంట్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ జిల్లా నూతన కార్యవర్గంతో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి

డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-పార్వతీపురం

పిల్లల్లో నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు సూచించారు. ఈ నెల 12న జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న డీవార్మింగ్ కార్యక్రమానికి జిల్లాకు సరఫరా చేసిన ఆల్బెండజోల్ మాత్రలను డిఎంహెచ్ఒ చేతుల మీదుగా వైద్య సిబ్బందికి బుధవారం పంపిణీ చేశారు. పోస్టర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి క్షేత్రస్థాయిలో సన్నద్ధం కావాలని వైద్య, విద్య, అంగన్వాడీ, సంబంధిత శాఖలతో మండల, సచివాలయ స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఏడాది నుంచి 19 ఏళ్ల వరకు పిల్లలు, విద్యార్థులకు ఈ నెల 12న అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల, కళాశాలలో ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. 1 నుండి 2 సంవత్సరాల పిల్లలకి సగం మాత్ర పొడి చేసి నీటితో కలిపి ఇవ్వాలని చెప్పారు. 2 నుండి 3 సంవత్సరాల పిల్లలకి పూర్తి మాత్ర పొడి చేసి నీటితో కలిపి ఇవ్వాలన్నారు. 3 నుండి 19 ఏళ్ల వరకు పూర్తి మాత్ర బాగా నమలాలన్నారు. 12న వేయని వారికి ఈనెల 20న మాప్‌అప్ కార్యక్రమంలో మాత్రలు వేయాలన్నారు. పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యలు ప్రబలుతాయన్నారు. చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ జిల్లాకు 2,13,000 ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేసినట్లు తెలిపారు. జిల్లాలో 1,96,612 మంది అంగన్వాడీ, పాఠశాల, కళాశాల పిల్లలు, విద్యార్థుల లక్ష్యంగా ఆల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్రలు వేయించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్‌మోహనరావు, పి.ఎల్ రఘు కుమార్, సూపరింటెండెంట్ కామేశ్వరరావు, సిడిఎస్ ఫార్మసిస్ట్ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.



ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

నేడు జాతీయ చేనేత దినోత్సవం

ప్రజాశక్తి-పార్వతీపురం

జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం బలిజిపేట మండలం నారాయణపురం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి టి.జనార్దనరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని ఆయన చెప్పారు. చేనేత సంఘాల సభ్యులు, అనుభవజ్ఞులు పాల్గొని వివిధ అంశాలను వివరిస్తారని తెలిపారు.

నేడు తల్లిపాల వారోత్సవాలు ముగింపు

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని సాలూరులో గురువారం నిర్వహించనున్నట్టు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి టి.కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను సాలూరులో కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరవుతారని తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో గురువారం కేన్సర్‌కు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ సహకారంతో జిల్లా ఆసుపత్రిలో ఉచిత స్క్రీనింగ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్త్రీ, పురుషులకు దీనిని నిర్వహిస్తారని ముఖ్యంగా స్త్రీలకు గైనిక్, రొమ్ము, గర్భాశయ, ఇతర కేన్సర్లకు స్క్రీనింగ్ చేస్తారని చెప్పారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పట్టాలివ్వాలని గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

పోడు భూములకు పూర్తిస్థాయిలో పట్టాలు మంజూరు చేయాలని పాచిపెంట మండలం గరిసిగుడ్డి పంచాయతీ చిమిడివలస వద్ద బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి గిరిజనులకు సాగు హక్కులు కల్పించాలన్నారు. గతంలో కొందరికి పట్టాలిచ్చి, మిగతా వారికి ఇవ్వలేదన్నారు. ఐదు ఎకరాలు సాగులో ఉంటే, ఎకరా, అర ఎకరాకు మాత్రమే పట్టాలిచ్చారని చెప్పారు. పట్టాలు మంజూరు చేయకపోవడం వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే పూర్తిస్థాయిలో పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజనులు వలసి రాజు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ ఆలయానికి కొత్త శోభ

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయం కొత్త శోభ సంతరించుకుంది. గతంలో ఆలయం చుట్టూ స్థలం ఉన్నప్పటికీ ఆలయం తెరచాటున ఉండే పరిస్థితి కనిపించేది. నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు ఆలయ అభివృద్ధిపై దృష్టి పెట్టారు. దీంతో కోట దుర్గమ్మ ఆలయ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. వృథాగా ఉన్న, శిథిలావస్థకు చెందిన భవనాలను జెసిబితో తీయించి పూర్తిగా చదును చేస్తున్నారు. ఈ పనులను బుధవారం పల్లా కొండలరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, ఆలయ కార్యనిర్వాహక అధికారి సూర్యనారాయణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ ఆలయానికి ఆనుకొని ఉన్న పశువుల ఆసుపత్రిని కూడా వేరే చోటకు మార్చే ప్రతిపాదన ఉందన్నారు. ఎమ్మెల్యే జయకృష్ణ ఈ విషయాన్ని పరిశీలిస్తున్నారన్నారు. దసరా ఉత్సవాలు కూడా వైభవంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. యాత్రికులకు సౌకర్యాలు కల్పించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ ప్రతినిధి ఆకుల కుమార్, బోగాది వెంకటరమణ, దుప్పాడ రమణ, శిల్లా గుప్తా, రాంబాబు, వరహాల నాయుడు ఉన్నారు.

పిహెచ్‌సిలో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ పద్మావతి

పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని బాగువలస పిహెచ్‌సిని బుధవారం డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కెవిఎస్ పద్మావతి పరిశీలించారు. ముందుగా పెదపదంలో నిర్వహించిన కౌమార రక్తహీనత సమావేశంలో పాల్గొన్నారు. ఎఎంసి, పిఎన్‌సి మహిళలు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. పౌష్టికాహారం ప్రతిరోజూ తీసుకోవాలని సూచించారు. తీవ్రమైన రక్తహీనత ఉన్న మహిళలను గుర్తించి వారికి ఫోలిక్ యాసిడ్, ఐరన్ సుక్రోజ్ మొదలైన ఇంజక్షన్లు అందించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలకు నిరంతరం వెళ్లి, అక్కడ పిల్లల ఆరోగ్య పరిస్థితులను, పరిసరాల పరిశుభ్రతను పాఠశాల ఉపాధ్యాయులతో చర్చించాలని చెప్పారు. వారికి సరైన వైద్య సేవలు అందే విధంగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం పిహెచ్‌సిలో ఒపి, గర్భిణుల రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రవికిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఐ నాయకులు రామచంద్రరావు మృతి

ప్రజాశక్తి-సాలూరు

రామచంద్రరావు (ఫైల్)

సిపిఐ సీనియర్ నాయకులు సిద్ధాబత్తుల రామచంద్రరావు (77) మంగళవారం రాత్రి కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సిపిఐ, ఎఐటియుసి నాయకునిగా సుదీర్ఘ కాలం పని చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామచంద్రరావు మృతికి వివిధ రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సిపిఐ నాయకులు బుడితి అప్పలనాయుడు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు సంతాపం తెలిపారు. మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర, వైసిపి నాయకులు గిరి రఘు, తెలగా సంఘం నాయకులు బాలబోలు రవి రామచంద్రరావు మృతికి నివాళులర్పించారు.

కుట్టు శిక్షణను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-సీతానగరం

కుట్టు మిషన్ల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. బుధవారం సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 90 రోజుల కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మొదటి బ్యాచ్‌లో 67 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

చెత్త సేకరణను పరిశీలన

మండలంలోని బల్లకృష్ణరాయపురం పంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని చెప్పారు. చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి, ఆర్థిక వనరుగా మార్చుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకులను పరిశీలించి, క్లోరినేషన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పాలకొండ అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ జామి సర్వేశ్వరరావు అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిమాపక పరికరాలు ఉపయోగించే పద్ధతులు, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాన్ని నిర్మూలించే పద్ధతులను వివరించారు. చెరువులు, జలపాతాలు, నదులు, సముద్రాల దగ్గర ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పిడుగు పడే సందర్భంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ మరమ్మతులు

ప్రజాశక్తి-సీతంపేట

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సీతంపేట ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ మరమ్మతులను ఎఇ జి. నీలిమ, కార్యదర్శి బి.రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. గత కొద్ది కాలంగా సెంట్రల్ లైటింగ్ సెన్సార్ రిపేర్ కావడంతో దీపాలు కొంత సమయం వెలిగి, ఆగి, తక్కువ కాంతి వచ్చేవి. దీంతో ఎఇ స్పందించి సిబ్బంది సహకారంతో మరమ్మతులు చేపట్టారు.

ఏడాది పొడవునా పంటలు పండించాలి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్

సీతానగరం.. అవగాహన కల్పిస్తున్న ఎఒ అవినాష్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతులు ఏడాది పొడవునా పంటలు పండించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ ప్రాంగణంలో జిల్లాలోని 15 మండలాలకు చెందిన విఎఎలు, విహెచ్ఎలు, ఎఇఒలకు ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటతోపాటు 20 నుంచి 30 రకాల పంటలు వేసుకోవడం వల్ల భూమిలో జీవవైవిధ్యాన్ని పెంపొందించవచ్చన్నారు. భూమిలో ఉన్న సూక్ష్మ జీవులు క్రియాశీలకంగా మారి భూసారం పెంపొందించి మొక్కలకు కావలసిన అన్నిరకాల సూక్ష్మ స్థూల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని చెప్పారు. భూమిలో సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందన్నారు. నేల జీవం కోల్పోకుండా, విష రహిత పదార్థాలు ఉపయోగించకుండా ప్రకృతిని, భూమిని కాపాడినవారు అవుతారని తెలిపారు. రీజనల్ తీమోటిక్ లీడ్ ప్రకాశ్, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ ఎం.శ్రావణ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

వరుస నాట్లతో అధిక దిగుబడులు

పాచిపెంట : సంప్రదాయ వరినాట్లకంటే వరుస పద్ధతిలో మొనల చివర తుంచి నాటుకుంటే ఖర్చు తగ్గడమే కాకుండా దిగుబడి కూడా పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. బుధవారం మండలంలోని చెరుకుపల్లి పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. రైతులు ఎడ్ల సత్యం, పైల అప్పలనాయుడు వేయిస్తున్న బెంగాల్ వరి నాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వరి నాట్లను వేగవంతంగా పూర్తి చేయడమే, ఉబాలకు ఎకరానికి కేవలం 4500 రూపాయలు మాత్రమే ఖర్చవుతుందని తెలిపారు. సంప్రదాయ వరి నాటే విధానంలో ఖర్చు రూ.7500 అవుతుందని చెప్పారు. వరి నాట్లు వరుసలలో పడడమే కాకుండా తేలికపాటి నాట్లు పడుతున్నాయని తెలిపారు. ఒకటి లేదా రెండు మొనలను మాత్రమే నాటుతున్నారని, దీనివల్ల దుబ్బు బాగా చేసి దిగుబడి పెరుగుతుందని చెప్పారు. పాయలు తీసి ఉంచడం వల్ల అంతర కృషి, ఎరువులు చల్లడం వంటివి సులభతరం అవుతున్నాయన్నారు. ఎకరానికి 15 కిలోల నారు సరిపోతుందని, విత్తనం ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. అనంతరం పచ్చిరొట్ట, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లావణ్య, ఎఇఒ నాగమణి పాల్గొన్నారు.

గుచ్చిమిలో పొలం పిలుస్తోంది

సీతానగరం : మండలంలోని గుచ్చిమి గ్రామంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ అధ్యక్షతన గుచ్చిమి బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ అవినాష్ మాట్లాడుతూ వరి గట్లపై కంది విత్తనాలు వేయడం వల్ల మంచి ఆదాయం పొందవచ్చన్నారు. ఇది వరి పంటకు ఎలాంటి హాని కలిగించకుండా, గట్ల స్థలాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకునే ఒక మంచి పద్ధతని చెప్పారు. ఈ విధానం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని సంపాదించడంతోపాటు నేల కోతను కూడా తగ్గించవచ్చని తెలిపారు. వరిలో ఎరువుల యాజమాన్యం పంట దిగుబడిని ప్రభావితం చేస్తుందని, సరైన మోతాదులో ఎరువులు వేయడం వల్ల పంట ఆరోగ్యంగా పెరుగుతుందని చెప్పారు. మంచి దిగుబడి వస్తుందన్నారు. రసాయన ఎరువులతో పాటుగా సేంద్రియ లేదా జీవన ఎరువులను ఉపయోగించడం సమగ్ర పోషక యాజమాన్యంలో ముఖ్యమైన అంశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పాచిపెంట.. వరుస పద్ధతిలో నాట్లపై అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

సాగులో మెలకువలు పాటించాలి

వీరఘట్టం : సాగులో మెలకుకలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి జక్కువ సౌజన్య రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కె.ఇచ్చాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సేంద్రీయ పద్ధతిలో పంటలు సాగు చేసేందుకు చొరవ చూపాలన్నారు. సేంద్రీయ ఎరువులు తయారు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుతో పంటలకు పిచికారి చేసే విధానం గూర్చి రైతులకు వివరించారు. పొలం గట్లపై కందులు కూడా చల్లుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ యాంకర్ ఎం.సింహాచలం, గ్రామీణ వ్యవసాయ సహాయకులు సింధూజ, రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవి

సీతానగరం.. ర్యాలీ చేపడుతున్న అంగన్వాడీలు, వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-సీతానగరం

తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌వి వరలక్ష్మి అన్నారు. మండలంలోని నిడగల్లులో తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణిగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు అందిస్తే ఎంతో మంచిదన్నారు. దీంతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌ఒ ధరణి, ఎఎన్ఎం సావిత్రి, అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతిలక్ష్మి, జయలక్ష్మి, నాగమణి, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : పుట్టిన ప్రతి బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి జి.సుగుణ కుమారి తెలిపారు. మండలంలోని మాదిలింగి, గంగరేగువలస సెక్టార్ పరిధిలోని మాదలింగి, కంబవలస పంచాయతీ డంగాభద్ర గ్రామాల్లో తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం, వినియోగంపై వివరించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ తల్లిపాలు పెట్టకుండా డబ్బా పాలు పడుతున్న వారికి వాటివల్ల కలిగే అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు లక్ష్మి, శారదంబ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : తల్లి పాల వారోత్సవాలను బుధవారం ఉల్లిభద్ర అంగన్వాడీ సెంటర్ వద్ద నిర్వహించారు. పి హెచ్ ఎన్ రవణమ్మ మాట్లాడుతూ మొదటి 6 నెలలు తల్లి పాల ద్వారా మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సుబ్బలక్ష్మి , ఉదయకుమారి, అంగన్వాడీలు లావణ్య, కల్పన, ఆశా కార్యకర్త భవాని పాల్గొన్నారు.

కొమరాడ.. గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతున్న పిఒ సుగుణకుమారి

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

రక్తహీనత నివారణ లక్ష్యంగా కార్యాచరణ

ఎనీమియా యాక్షన్ కమిటీ సమావేశంలో డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-పార్వతీపురం

రక్తహీనత నివారణ లక్ష్యంగా ఎనీమియా యాక్షన్ కమిటీలు కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. 12వ వార్డులో నిర్వహించిన ఎనీమియా యాక్షన్ కమిటీ సమావేశంలో బుధవారం ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. గతనెలలో రక్తహీనతగా గుర్తించిన గర్భిణీ, బాలింతలు, కిశోర బాలికల వివరాలు, ఈ నెలలో వారి హిమోగ్లోబిన్ శాతం మెరుగు పడిన తీరుపై అడిగి తెలుసుకొని రికార్డు పరిశీలించారు. రక్తహీనత గుర్తిస్తే అందుకు గల కారణాలపై కమిటీలో విశ్లేషించి తదుపరి కార్యాచరణ రూపొందించాలన్నారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేస్తున్న తీరు, టిహెచ్ఆర్ పౌష్టికాహారం సరిగా తీసుకుంటున్నారా, ఏమైనా ఆరోగ్యపరమైన సమస్యలు గాని, కుటుంబ, మానసిక సమస్యల, సాంస్కృతిక విధానాల ప్రభావం ఉన్నాయా అనే అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. ఆహారంలో ఆకు కూరలు సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలన్నారు. తల్లిపాలు ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్ మోహనరావు, రఘుకుమార్, వైద్యాధికారి రవిచంద్ర, సూపర్‌వైజర్ పుష్ప, వార్డు సెక్రటరీ జి.పవన్ కుమార్, వైద్య, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సాంబమూర్తి

గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలుచేయాలి

ప్రజాశక్తి -కొమరాడ

గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు రమేష్, కైలాస్, జన నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని పెద్దశాఖ గ్రామంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. గిరిజనులకు వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్‌ను ప్రకటించాలన్నారు. ఐదో షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన యువకులు, మహిళలు పాల్గొన్నారు.

జిఒ 25 ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలి

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్

వినతి అందిస్తున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల కుటుంబ సభ్యులకు జిఒ 25 ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు.. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారి డి.రూబేన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శంకర్రావు, పి.వరదరాజు మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో గత రెండేళ్లలో విధులు నిర్వహిస్తూ అనేక కారణాలతో ముగ్గురు కాంట్రాక్టు కార్మికులు మరణించారని తెలిపారు. వారికి న్యాయం చేస్తామని ఆనాటి నుండి అధికారులు, ప్రభుత్వం హామీలిచ్చినా ఆచరణలో లేదన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో అమలు చేయకపోవడం అన్యాయమని మండిపడ్డారు. వెంటనే ఇక్కడా జిఒ 25ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ సింహాచలం, మామిడి శివ, బంగారు రాజేష్, నాగవంశం మల్లేష్, బంగారి బాలు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మేజర్ పంచాయతీలో బుధవారం శోభలతదేవి కాలనీ, వైరిచర్ల కాలనీ తదితర వీధుల్లో పలు కాలువల్లో పారిశుధ్య పనులు, పూడికతీతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇఒ కె.సురేష్ మాట్లాడుతూ వర్షాలు పడటంతో ప్రజలెవరూ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని వీధుల్లో పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి ట్యాంకుల వద్ద క్లోరినేషన్ చేయిస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా పారిశుధ్య లోపం ఉంటే తమకు తెలియజేయాలని కోరారు.

నడుకూరులో..

వీరఘట్టం : మండలంలోని నడుకూరు గ్రామంలో బుధవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల పక్కన ఉన్న కాలువలో గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన చెత్తను జెసిబి ద్వారా తొలగించారు. గ్రామంలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.రమాదేవి, కార్యదర్శి బి.కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి

ప్రజాశక్తి -భామిని

భామిని మండలం పెద్దదిమిలి గ్రామానికి చెందిన బలగ నారాయణరావు(36) బుధవారం సాయంత్రం పాము కాటుతో మృతి చెందాడు. తన పొలంలో బీరకాయలు తీస్తుండగా బలగ నారాయణ రావు పాముకాటుకు గురయ్యాడు. ఆయనకు భార్య స్వప్న, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు బత్తిలి పోలీసులు తెలిపారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి-వీరఘట్టం

సంపూర్ణ అభియాన్ సమాన్ సమరోత్ ద్వారా ఉత్తమ అవార్డులు అందుకున్న ఎంఇఒలు డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావును స్థానిక విద్యా వనరుల కేంద్రంలో బుధవారం ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన సన్మానించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు మురళి, ధనుంజయ నాయుడు, నరహరి, రామారావు, శ్రీనివాసరావు, గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

నవోదయ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కిమ్మీ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు బుధవారం విశాఖపట్నంలోని మారికవలస వద్దనున్న ఎన్ఎన్ కోచింగ్ సెంటర్ నవోదయ మెటీరియల్‌ను అందజేసింది. మాజీ సర్పంచ్ గురాన వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.సింహాచలం, బి.అప్పలనాయుడు, వాసుదేవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కురుపాం.. మాట్లాడుతున్న ఎస్ఐ నీలకంఠరావు

ప్రజాశక్తి - కురుపాం

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని నీలకంఠపురం ఎస్ఐ నీలకంఠరావు సూచించారు. బుధవారం మండలంలో ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రహదారి భద్రత నియమాలు, ఆన్‌లైన్ మోసాలు, పోక్సో చట్టం, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే సక్రమంగా చదువుకొని, ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని, ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావద్దు

వీరఘట్టం : విద్యార్థులు వ్యసనాలకు బానిస కావద్దని ఎస్ఐ జి.కళాధర్ సూచించారు. బుధవారం మండలంలోని గంగంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ పాఠశాలకు వచ్చి చక్కగా చదవాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు, ఉపాధ్యాయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం.. మాట్లాడుతున్న ఎస్ఐ కళాధర్